క్లుప్తంగా

విద్యార్థులకు కంటి పరీక్షలు



పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం కంటి జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన పౌష్టికాహారం, పాటించాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

యూనిఫాం అందజేత



పాన్‌గల్: మండలంలోని వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రెండో జత యూనిఫాంను గురువారం అందజేసినట్లు పాఠశాల హెచ్‌ఎం వెంకటేష్‌యాదవ్ తెలిపారు. పాఠశాలలోని 34 మంది విద్యార్థులకు గాను హాజరైన 25 మంది విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని 19వ వార్డుకు చెందిన సోహెల్ అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని స్థానిక నాయకుడు ఎల్‌బీసీ కృష్ణ ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆదేశాలతో పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, టీపీసీసీ వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ద్యారపోగు వెంకటేష్ గురువారం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే అందించిన రూ. 5వేల ఆర్థికసాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. వారి వెంట తిరుపతి నాయక్, గోపికృష్ణ సాగర్ ఉన్నారు.

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని వై.శాఖాపూర్ గ్రామానికి చెందిన పెంచికల పాడు కృష్ణయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. పి.కృష్ణయ్య కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని పెబ్బేరు ముదిరాజ్ సంఘం సభ్యులు చందాలు పోగు చేసి రూ.9వేల నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బాలస్వామి, కురుమూర్తి, సహదేవుడు, భీముడు, బీచుపల్లి, శ్రీనివాసులు, భరత్, చెన్నయ్య, కథల్, ఎల్లయ్య, నారాయణ, కేశవులు, మాదన్న, తిరుపతయ్య ఉన్నారు.

మట్టి వినాయకులను పూజించండి

అమరచింత: వినాయక చవితిని పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించడంతో పర్యావరణాన్ని కాపాడిన వారవుతారని సీఐ శివకుమార్ అన్నారు. వినాయక మండపాల నిర్వహణ కమిటీ సభ్యులతో గురువారం పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ వినాయక మండపం వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి వేళ మండపం వద్ద కాపలాగా ఒక వ్యక్తి ఉండాలని సూచించారు. మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐ సురేష్ పాల్గొన్నారు.

వ్యక్తికి జరిమానా

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడకు చెందిన షాపురం గోవర్ధన్‌రెడ్డి బైండోవర్‌ను అతిక్రమించడంతో తహసీల్దార్ పాండునాయక్ జరిమానా విధించారని ఎస్సై రావుల గిరిధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. షాపురం గోవర్ధన్‌రెడ్డి గతంలో పంచాయతీ కార్యదర్శితో దురుసుగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేశారన్నారు. ఎన్నికల సమయంలో గొడవలకు కారణమవుతాడనే ఉద్దేశంతో అతడిని ఎస్‌ఐ శ్రీహరి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయగా.. ఒక సంవత్సరం కాలపరిమితితో రూ.లక్ష పూచికత్తుతో పంపించారు. కానీ కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు పెట్టడంతో అదే గ్రామానికి చెందిన వెంకట్రావు ఫిర్యాదు మేరకు అతడిపై సంవత్సరంలోపే మరో కేసు నమోదయ్యింది. దీంతో తహసీల్దార్ పాండునాయక్ ఎదుట మరోసారి బైండోవర్ చేశారన్నారు. అతడి కుటుంబ పరిస్థితిని గుర్తించి రూ.లక్ష కాకుండా రూ.15 వేల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి

పాన్‌గల్: మత్స్యకారుల అభ్యున్నతి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పెద్దబాలరాజు అన్నారు. గురువారం మండలంలోని శాగాపూర్ కొత్తచెరువులో మత్స్యకారులతో కలిసి చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ప్రభుత్వం చేపపిల్లలను అందజేస్తుందన్నారు. మత్స్యకారులు ఐకమత్యంతో పనిచేస్తూ చేపపిల్లలను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కానమోని రాములు, పెద్దమైబూషి, రాములు, రామకృష్ణ, రాజేంద్రప్రసాద్, మత్స్యకార సంఘం నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత



కంచిరావుపల్లిలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న ప్రత్యేక అధికారి నాగేంద్రం

వనపర్తి రూరల్: మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పెబ్బేరు మండల ప్రత్యేక అధికారి పి.నాగేంద్రం అన్నారు. 'నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద' కార్యక్రమంలో భాగంగా గురువారం కంచిరావుపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు మనిషి మనుగడను కాపాడుతాయని, చెట్లు వాతావరణ కలుషితం కాకుండా చూడటంతో పాటు ఆక్సిజన్‌ను అందిస్తాయన్నారు. పాఠశాల ఆవరణలో నాటిన ప్రతి మొక్కను బతికించుకునే బాధ్యత విద్యార్థులదే అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్ర, ఎంపీఓ రోజా, పంచాయతీ కార్యదర్శులు మల్లయ్య, ఉపాధ్యాయ బృందం, ఫీల్డ్ అసిస్టెంట్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

కంభాళాపూర్‌లో..

శ్రీరంగాపూర్ మండలంలోని కంభాళాపూర్‌లో గల ఆలయ ఆవరణ సమీపంలో స్థానిక అధికారులతో కలిసి ప్రత్యేక అధికారి సుషిత మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎంపీఓ రాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పెద్దమండడి ఎంపీఓ పుష్ప అన్నారు. గురువారం పెద్దమండడి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సిబ్బందితో కలిసి ఎంపీఓ మొక్కలు నాటి, నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ మనిషి మనుగడ మొక్కలతోనే ముడిపడి ఉందని, అందుకే ప్రకృతిని కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు.కార్యక్రమంలో ఏపీఓ సురేష్, టీఏ సత్యం, పంచాయతీ కార్యదర్శి దిలీప్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ భీమయ్య తదితరులు ఉన్నారు.

వీపనగండ్ల: నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని ఎంపీడీఓ శ్రీనివాసరావు, నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ అన్నారు. గురువారం 'నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీదుగా' కార్యక్రమంలో భాగంగా కల్వరాలలో మొక్కలు నాటారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మొక్కలను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, గ్రామంలోని మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సేవా సభ్యులు భాగస్వాములై మొక్కలను సంరక్షించాలని కోరారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంతో పాటుగా మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు, రోడ్ల వెంట మొక్కలు నాటారు. అనంతరం డెంగీ వ్యాధి సర్వేలో భాగంగా ప్రజలకు కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా మొక్కలు నాటడంతో పాటుగా వాటిని పెంచే బాధ్యతలను అధికారులు తీసుకున్నారు.

అమరచింత: మొక్కలను నాటి పర్యావరణం రక్షించడానికి యువత ముందుకు రావాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని సింగంపేట, ధర్మాపురం గ్రామాల్లో గురువారం మొక్కలు నాటారు.

ఆత్మకూర్: మండలంలోని గ్రామాల్లో అధికారులు, పంచాయతీ సిబ్బంది మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీరాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



షాపురంలో..



కల్వరాలలో ..



పెద్దమందడిలో మొక్కలు నాటుతున్న ఏపీఓ పుష్ప



ధర్మాపురంలో..

దరఖాస్తు చేసుకోవాలి

ఆత్మకూర్: రుణమాఫీకి అర్హత ఉండి మాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి వినయ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండలంలో 9,359 మంది రైతులకు గాను రూ.88.62 కోట్లు రుణమాఫీ అయ్యిందన్నారు. రుణమాఫీ కాని 220 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



ఆత్మకూర్: సీతారామాంజనేయ సమేత రాఘవేంద్రస్వామి ఆలయంలో స్వామివారి 353వ ఆరాధనోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడురోజులుగా నిర్వహిస్తున్న పూజలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు నిర్మాల్యవిసర్జనం, పంచామృతాభిషేకం, అర్చన, అష్టోత్తరం, స్వామివారికి పల్లకీసేవ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో నిర్వాహకులు జ్యోషిగుండాచారి, రవికుమార్‌దేశాయ్, మస్తీపూర్ రాజు, వెంకట్‌జ్యోషి, రంగనాథచారి, వాసుచారి, వెంకోబురావ్, భక్తులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులతో అప్రమత్తం



గ్రామస్తులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న పీహెచ్‌సీ డాక్టర్, ఎంపీడీఓ

పాన్‌గల్: కీటక జనిత వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ ప్రజలకు సూచించారు. గురువారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో వైద్య సిబ్బందితో కలిసి కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం ప్రతి గ్రామంలో పర్యటిస్తూ కీటక జనిత వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. దోమల వృద్ధితో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధుల ప్రబలే అవకాశం ఉందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీటిని వారానికి ఒక్కసారి పారబోస్తూ నూతన నీటిని పట్టుకోవాలని సూచించారు. కరపత్రాలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోవింద్‌రావు, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ తారకశాంక్, సూపర్‌వైజర్ సుమనశ్రీ, వైద్య సిబ్బంది సంతోషి, రాంచందర్, మదన్‌గోపాల్, శిరీష, పంచాయతీ కార్యదర్శి నీలిమ పాల్గొన్నారు.

ఉనికి కోసమే బీఆర్‌ఎస్ పోరాటం



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి, బోయేజ్

కొత్తకోట రూరల్: ఉనికిని కాపాడుకోవడం కోసమే రైతు రుణమాఫీపై బీఆర్‌ఎస్ రాజకీయాలు చేస్తుందని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్జే బోయేజ్ ఎద్దేవా చేశారు. పదేళ్ల అధికారంలో ఉండి ప్రజలకు ఇచ్చిన హామీ అమలు చేయని బీఆర్‌ఎస్ అధిష్టానం నేడు ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని రాహుల్‌గాంధీ ప్రకటించిన ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి అర్హులందరికీ రుణమాఫీ చేశారన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అడ్రస్ గల్లంతు అయ్యిందని, వారిని పట్టించుకునే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. సాంకేతిక కారణాల వల్ల కొందరికి రుణమాఫీ కాలేదని, అలాంటి వారికి న్యాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రుణమాఫీ కాని రైతులు అధైర్యపడకుండా.. వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, మిషేక్, పి.రవీందర్‌రెడ్డి, సాయిలుయాదవ్, రమేష్, సాయికుమార్, వెంకటేష్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

గట్లుఖానాపూర్, బుగ్గపల్లితండాలో డెంగీ కేసులు



రోగుల నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

కొత్తకోట రూరల్: మండలంలోని గట్లుఖానాపూర్, బుగ్గపల్లితండాలో రెండు డెంగీ కేసులు నమోదైనట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మంజుల తెలిపారు. ఈ మేరకు గురువారం జిల్లా అదనపు అధికారి శ్రీనివాస్‌తో పాటు వైద్య సిబ్బంది ఆయా గ్రామాలకు వెళ్లి డెంగీతో బాధపడుతున్న వారిని పరీక్షించి వైద్య సేవలు అందించారు. వారి నుంచి రక్తనమూనాలు సేకరించారు. పాజిటివ్ కేసులు నమోదైన ఇళ్లకు సమీపంలోని 500మీటర్ల పరిధిలో గల నివాస గృహాలకు పైరేత్రియం పిచికారీ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఓంప్రకాష్, వైద్య సిబ్బంది, ఆశాలు, పంచాయితీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి



రేవల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వనపర్తి రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రైతులందరికీ రుణమాఫీ చేయాలని గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పెబ్బేరు, శ్రీరంగాపురం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వనం రాములు, దిలీప్‌రెడ్డి, వెంకటస్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఎటువంటి షరతులు లేకుండా రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గోపాల్‌పేట, రేవల్లి మండల కేంద్రాల్లో వారు నిరసన వ్యక్తం చేశా రు. అనంతరం తహసల్దార్ తిలక్‌కుమార్‌రెడ్డికి విన తిపత్రం అందించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఖిల్లాఘనపురం: భూమి ఉన్న ప్రతి రైతుకు ప్రభుత్వం రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, జిల్లా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ అధిష్టానం ఆదేశాల మేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట స్థానిక నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పురేంధర్‌రెడ్డి, చిన్న అంజనేయులుగౌడు, బాలీశ్వర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బుచ్చిబాబుగౌడు, కృష్ణయ్య యాదవ్, పీనానాయక్, పెద్ద అంజనేయులుగౌడ్, మన్యంగౌడ్, శరత్‌కుమార్, బాల్‌రెడ్డి, పెద్ద మల్లారెడ్డి, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



పెబ్బేరులో..



శ్రీరంగాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద..

సబ్‌స్టేషన్ మంజూరుపై హర్షం

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లికి సబ్‌స్టేషన్ మంజూరు కావడంతో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బలిజపల్లి శివారులోని సబ్‌స్టేషన్ నుంచి ప్రస్తుతం పామిరెడ్డిపల్లితో పాటు ముందరితండా, చీకరుచెట్టుతండా, వీరాయపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతుంది. ఈ ఫీడర్ పరిధిలో సుమారు 55 కిలోమీటర్ల విద్యుత్ లైన్, 200 ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో తరుచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని కాంగ్రెస్ నాయకులు విషయాన్ని ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన గ్రామానికి సబ్‌స్టేషన్ మంజూరు చేయించారు. దీంతో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామంలో పర్యటించిన ఏఈ శ్రీకాంత్ స్థలం చూపిస్తే.. వేగంగా పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం, రఘుగౌడ్, చందు, నరేష్, షౌకత్ ఉన్నారు.

జానపద దినోత్సవం

వనపర్తిటౌన్: ప్రస్తుత సమాజంలో జానపద కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి డప్పు స్వామి, ప్రజావాగ్గేయ కారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ప్రపంచ జానపద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కేక్ కట్ చేసుకొని ఒకరికొకరు తినిపించుకొని స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో శంకర్‌గౌడ్, బైరోజు చంద్రశేఖర్, నాగరాజు, కురుమయ్య, జయరాం, మల్లన్న, నందిమల్ల రాములు, డప్పు నాగరాజు, రాజు, బాలేమియా తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని 6బై2ఏ లోని ప్లాట్ నెంబర్ 19, 20 లో గురువారం తహసీల్దార్ పాండునాయక్, ఎస్ శ్రీహరి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్లాట్లకు సంబంధించి కోర్టుల్లో కేసు నడుస్తున్న సమయంలో గ్రామానికి చెందిన రాళ్ల కృష్ణయ్య, కె.తార్యనాయక్ అనుచరులు, ఎండీ జియా మొహిద్దీన్ అనుచరులు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని భారతీయ నాగరిక సురక్షా సంహితలోని సెక్షన్ 164 (145సీఆర్‌పీ) ప్రకారం ఖిల్లా ఘనపురం ఎస్ శ్రీహరి వినతి మేరకు తహసీల్దార్ పాండునాయక్ ఆర్‌డీఓ సిఫార్సుతో రెండు ప్లాట్లను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నట్లు వారు చెప్పారు. ప్రొసీడింగ్ నెంబర్ సి.402.2024, తేదీ 31.07.2024 ద్వారా ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

మహిళా జర్నలిస్టులపై దాడులు సరికాదు

వనపర్తిటౌన్: ప్రజాస్వామ్య పరిరక్షణకు, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పరితపించే జర్నలిస్టులపై దాడులు చేయడం సరికాదని టీయూడబ్ల్యూజే (హెచ్ 143) జిల్లా అధ్యక్షుడు బక్షి శ్రీధర్‌రావు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లిలో సీఎం సొంత ఇలాఖాలో మహిళా జర్నలిస్టులపై జరిగిన దాడులను నిరసిస్తూ బక్షి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో గురువారం రాత్రి జిల్లా కేంద్రంలో నిరసన తెలిపారు. నరసింహారెడ్డి, నగేష్, జానీ, రాజు, శ్రీనివాస్‌యాదవ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి, నవగ్రహ ప్రతిష్ఠమహోత్సవం



ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడలో గురువారం ఆంజనేయస్వామి పునఃప్రతిష్ఠ, నవగ్రహ, ధ్వజ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవాన్ని గ్రామస్తులు కనులపండువగా నిర్వహించారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఆలయం వద్ద గణపతి పూజ, రక్షాబంధన, యాగశాల ప్రవేశం, పుణ్యాహవాచం, అంకురారోహణ తదితర పూజలు, గణపతి, నవగ్రహ, శాంతి తదితర హోమాలు, ధాన్యాదివాసం, శయ్యాదివాసము, ప్రాణప్రతిష్ఠ తదితర పూజా కార్యక్రమాలను వేదపండితులు జేబీ శాస్త్రి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో చేశారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



మోటార్లను పరిశీలిస్తున్న చైర్మన్ మహేష్

వనపర్తిటౌన్: నాలుగు రోజులుగా రామన్‌పాడు వాటర్ పైపులైన్, రాజపేట వద్ద పగిలిన మిషన్ భగీరథ వాటర్ పైపులైన్లు, బుక్కపల్లి నుంచి వచ్చే పైపులైన్, రేవల్లి పైపులైన్లకు వాల్స్ బిగించే పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు తాగునీటి సమస్యను తీర్చాలని మున్సిపల్ చైర్మన్ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు గురువారం వాటర్ లైన్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు, నాలుగు రోజులుగా పట్టణంలో నీటి సరఫరా కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఇకపై నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని చెప్పారు. నీటి సమస్య అధికంగా ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. అంతకుముందు పగిలిన పైపులైన్లు, మోటార్లను పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సమన్వయకర్త లక్కాకుల సతీష్, కౌన్సిలర్లు వెంకటేష్, విభూతి నారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



విద్యార్థులకు బూట్లు, సాక్సులు అందజేస్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 110మంది విద్యార్థులకు బూట్లు, సాక్సులు రాజ్యసభ మాజీ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి అందజేశారు. రావుల చంద్రశేఖర్‌రెడ్డి సోదరుడు రావుల వెంకట్ రంగారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ బూట్లు, సాక్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను సైతం ఇదే పాఠశాలలోనే చదువుకున్నానని, ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న వారు ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని, ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచే కష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ రావుల సుదర్శన్‌రెడ్డి, కిరణ్ రెడ్డి, సాహితి కళావేదిక జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, బాలస్వామి, శ్రీవర్ధన్‌రెడ్డి, స్వామి, నిర్మలాదేవి, విజయ్‌కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

బ్యాంకుల వద్ద కొనసాగుతున్న రద్దీ



రైతులను క్యూలైన్‌లో బ్యాంక్ లోపలికి పంపిస్తున్న పోలీసులు

అమరచింత: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ రుణమాఫీ వివరాలను తెలుసుకునేందుకు వచ్చిన రైతులతో కిటకిటలాడింది. గురువారం నర్వ, అమరచింత మండలంలోని వివిధ గ్రామాల నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలిరావడంతో మేనేజర్ శివశంకర్ పోలీసుల సహకారంలో రైతులకు సేవలను అందించారు. బ్యాంకు ప్రధాన ద్వారం మూసి రైతులను క్యూలైన్ ద్వారా ఒకొక్కరిని లోపలికి అనుమతించడంతో రైతులు గంటల తరబడి నిల్చొనే పరిస్థితులు ఏర్పడ్డాయి.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు



పోతురాజుల నృత్యాలు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం నిర్వహించిన పోచమ్మ బోనాల మహోత్సవం కమనీయంగా జరిగింది. గ్రామం నలుమూలల నుంచి మహిళలు కుంకుమ, పసుపు, గంధం, పూలు, వేపాకుతో అలంకరించిన బోనంలో అమ్మవారి కోసం ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యంతో బారులు తీరారు. అన్ని వీధుల నుంచి భక్తులు ఒక్కసారిగా రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. గొర్రె పొటేళ్లతో అమ్మవారి రథాన్ని లాగించారు. పోతురాజుల నృత్యాలు పలువురిని ఆకర్షించాయి. భక్తులు అమ్మవారికి కోడిపుంజులు, గొర్రె పొటేళ్లు బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ముదిరాజ్ దేవాలయ కమిటీవారు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.